క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దీపారాధన



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల దీపారాధనను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. దుర్గాసహస్రనామ పూజను జరిపారు. ఈఓ విరుపావరుల గిరికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, ప్రధానార్చకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్ పరిధిలో గల జేవీఆర్ కాలనీలో 100 కేవీ సామర్థ్యం కలిగిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా లో ఓల్టేజీ సమస్య వస్తుండటంతో రూ.ఆరు లక్షలతో దీన్ని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ ఆధ్వర్యంలో ఏఈ లక్ష్మీనారాయణ, సిబ్బందితో కలిసి ఏర్పాటు చేశారు.

ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ



నెల్లూరు సిటీ: నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎనిమిది అంశాలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మాట్లాడారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యం, స్వయం సమృద్ధి, నీటి పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలపై చర్చించామని చెప్పారు. డీఎల్పీఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్ రెడ్డికాలనీలో గల ప్రసాద్ ఆస్పత్రిలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, డాక్టర్ ప్రసాద్, శ్రీవాణి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజేష్, అలియా, జకావుల్లా, శీనయ్య తదితరులు, పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో సమావేశం



నెల్లూరు (టౌన్): జిల్లాలోని పది పాఠశాలలకు రూ.రెండు లక్షల విలువజేసే ఎస్ఎక్స్. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందజేయడాన్ని డీఈఓ బాలాజీరావు అభినందించారు. ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నగరంలోని యష్‌పార్క్ హోటల్లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, స్మైల్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ కిశోర్, స్టెమ్ ఫెసిలిటేటర్లు హేమంత్, మురళి, జోష్ణవి, సుభానీ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని జీఎం సంజీవప్ప, ఆర్ఎం మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బ్యాంక్ అందిస్తున్న వివిధ పథకాలపై నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంజీవప్ప మాట్లాడారు. ప్రగతి త్రివేణి - 333, ప్రగతి కుబేర - 444 వంటి పథకాలతో పాటు వివిధ పథకాలను తెలియజేశారు. అన్ని రకాల రుణాలను త్వరితగతిన మంజూరు చేస్తున్నామని చెప్పారు. చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ మేనేజర్ అజయ్‌సింహారెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.





ప్రమాదపుటంచున ప్రయాణం

- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆటో డ్రైవర్లు
- పరిమితికి మించి విద్యార్థుల తరలింపు



నెల్లూరు(క్రైమ్): ఆటోల్లో విద్యార్థులు ప్రమాదపుటంచున ప్రయాణం సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని మితిమీరిన వేగంతో డ్రైవర్లు రాకపోకలు సాగిస్తున్నారు. ఇరువైపులా కూర్చోబెట్టుకొని తీసుకెళ్తున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు.

నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు చేపట్టాల్సిన రవాణా, పోలీస్ శాఖల అధికారులు మిన్నకుండిపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్మార్ట్ స్ట్రీట్ బజార్ల ఏర్పాటుకు ప్రణాళికలు



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): వీధి వ్యాపారుల సంక్షేమానికి గానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు నగరంలో ప్రయోగాత్మకంగా స్మార్ట్ స్ట్రీట్ బజార్ల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యనారాయణపురం, మైపాడు రోడ్డు, జాఫర్‌సాహెబ్ కాలువ ప్రాంతాల్లో 200 దుకాణాలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఒక్కో కంటైనర్‌లో నాలుగు షాపులు.. సోలార్ విద్యుత్ కనెక్షన్లు.. ప్రాంగణంలో పచ్చదనం.. పార్కింగ్ సౌకర్యం.. ఉచిత వై ఫై.. సెల్ఫీ పాయింట్ తదితరాలతో అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. కంటైనర్‌లో దుకాణాన్ని పొందేందుకు గానూ రూ.రెండు లక్షల రుణాన్ని మెప్మా ద్వారా అందించనున్నామని చెప్పారు. నోటిఫికేషన్ ద్వారా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలను త్వరలో తెలియజేయనున్నామని చెప్పారు. అదనపు కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, ఇంజినీరింగ్ ఎస్ఈ రామ్మోహన్‌రావు, టీపీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



నెల్లూరు (టౌన్): మానవ హక్కుల పరిరక్షణ బాధ్యతని ఆర్ఐఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి మా హక్కులు.. మా భవిష్యత్తు అంటూ నినాదాలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, భారతి, ప్రసన్న, అధ్యాపకులు కృష్ణవేణి, శ్రీదేవి, వెంకట్రావు, శ్రీధర్, శివయ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

21న ప్రీ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు రూరల్: నగరంలోని వీఆర్సీ మైదానంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను ఈ నెల 21న నిర్వహించనున్నామని రెవరెండ్ వినోద్, కన్వీనర్ నవీన్ ప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. మోస్ట్ రెవరెండ్ ప్రకాశం తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు.

రోడ్లపై వ్యర్థాలేస్తే చర్యలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై వ్యర్థాలేస్తూ అపరిశుభ్రం చేస్తున్న వ్యాపారులను గుర్తించి జరిమానాలు విధిస్తున్నామని నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి చైతన్య పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్ జంక్షన్, ముత్తుకూరు రోడ్డులోని వివిధ కూరగాయల దుకాణాల వద్ద రోడ్లపై వ్యర్థాలను వేసి ఉండటాన్ని గమనించి వ్యాపారులకు జరిమానా విధించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్థానిక సచివాలయ కార్యదర్శులతో మాట్లాడి వారి పరిధిలో పారిశుధ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 17 / 3 సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్మికుల మస్టర్‌ను తనిఖీ చేశారు.

నియామక ఉత్తర్వుల అందజేత



నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మృతి చెందిన ముగ్గురి వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఏఓ విజయ్‌కుమార్ మంగళవారం అందజేశారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్లుగా ప్రణయ్, వినీత్.. స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా చిన్న సుబ్బయ్యను నియమించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నాగమోహన్

నెల్లూరు సిటీ: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు తుది గడువు ఈ నెల 31 అని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని రూరల్ మండల వ్యవసాయాధికారి నాగమోహన్ పేర్కొన్నారు. పెద్ద చెరుకూరు, గుడుపల్లిపాడులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రం లేదా కామన్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించి ఎకరా వరి పంటకు రూ.168 చెల్లించాలని సూచించారు. దీని ద్వారా రూ.42 వేల బీమా సౌకర్యం లభించనుందని వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ జట్ల ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సబ్ జూనియర్ బాలబాలికల ఆర్చరీ జట్లను మాగుంట లేఅవుట్లో ఆర్చరీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు మాట్లాడారు. బాలుర ఇండియన్ రౌండ్‌లో వెంకటలోకేష్, సాత్విక్, ప్రసన్నకుమార్ యాదవ్, హరిశ్రీకర్, చక్రీష్‌కుమార్‌యాదవ్, నవదీప్.. బాలికల జట్టులో ప్రీతి, దీత్యాచండిక, లాస్య, లియాఖాన్, సిరివెల్లి ఎంపికయ్యారని చెప్పారు. రికర్వ్ రౌండ్‌లో సాయి మౌర్య, తరుణీష్ జాత్యా, రాజేష్, చరిత్, కౌషిక్.. బాలికల జట్టుకు నిష్వితఎంపికయ్యారని వివరించారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఎస్జీఎఫ్ఐ ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు.

అయ్యప్పస్వామికి పూజలు

నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. శీవేలి ఉత్సవం, మహాదీపారాధన తదితరాలను జరిపారు. ఉభయకర్తలుగా పోలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శోభారాణి, రాజేష్, సంజన దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, విజయకుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై దాడి

- కళ్లలో కారం కొట్టి దారుణం

నెల్లూరు(క్రైమ్): కారు బాడుగ అద్దె విషయమై డ్రైవర్ కళ్లలో కారం కొట్టి దాడి చేసిన వ్యక్తులపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని కోనేటిమిట్టకు చెందిన కారు డ్రైవర్ మురళి ఇంటి వద్దకు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్క్ వేసుకొని సోమవారం రాత్రి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో ఆయన లేకపోవడంతో నంబర్‌ను తెలుసుకున్నారు. కావలి వెళ్లేందుకు కారు కావాలని అడగ్గా, తన వద్ద లేదని చెప్పారు. అనంతరం తెలిసిన వారి వద్ద ఆరాతీసి సదరు వ్యక్తులకు మురళి ఫోన్ చేశారు. ఫతేఖాన్‌పేటలో మురళి వద్దకు వచ్చి, బాడుగ తగ్గించాలని మాట్లాడుతూ, అకస్మాత్తుగా కళ్లలో కారం కొట్టి రాయితో దాడి చేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు మంగళవారం నమోదు చేశారు. కాగా ఓ పథకం ప్రకారమే కారు డ్రైవర్‌పై దాడి జరిగిందని భావిస్తున్న పోలీసులు ఆ దిశగా విచారణ జరుపుతున్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి రంజన్‌సింగ్‌కు వినతిపత్రాన్ని ఢిల్లీలో మంగళవారం అందజేశారు.

వర్మికంపోస్ట్ తయారీపై 26న శిక్షణ

నెల్లూరు(సెంట్రల్): వర్మికంపోస్ట్ తయారీపై నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణను ఈ నెల 26న నిర్వహించనున్నామని కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లలితా శివజ్యోతి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడారు. శిక్షణకు హాజరుకావాలనుకునే వారు 79816 44675 నంబర్‌ను సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

ఆహార నాణ్యత ప్రమాణాలపై సదస్సు నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని రెస్టారెంట్లు, హోటళ్లలో ఆహార నాణ్యత ప్రమాణాల్లో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి నిర్వహించే సదస్సుకు హాజరై సూచనలివ్వాలని కోరారు.

గీతా జయంతి నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇస్కాన్ మందిరంలో గీతా జయంతిని బుధవారం నిర్వహించనున్నామని మందిరాధ్యక్షుడు శుకదేవస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతా పారాయణం, గీతా ప్రవచనం తదితరాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు సిటీ: కుష్టు వ్యాధిగ్రస్తులను సిబ్బంది క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ఆమంచర్లలోని లెప్రసీ కాలనీ వద్ద మంగళవారం నిర్వహించిన డీపీఎమ్మార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధిగ్రస్తులు నిత్యం మందులు వాడుతూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరంతో బాధపడుతుండటం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలతో బాధపడుతున్న వారు గళ్ల పరీక్ష, ఛాతి ఎక్స్‌రే తీయించుకోవాలని సూచించారు. న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, సౌత్‌మోపూరు వైద్యులు రవీంద్ర, రేఖ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



క్యాలెండర్ల ఆవిష్కరణ



దైవజనులకు వస్త్రాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): బట్వాడిపాళెం సెంటర్‌లోని సెకండ్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలను నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి, ఫెలోషిప్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. దైవసేవకులకు బహుమతులు, సండే స్కూల్ చిన్నారులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం కృతజ్ఞత పాట రచయిత సుభాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రెవరెండ్ సజ్జా బర్నబాస్, ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెవరెండ్ శరత్, రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, కోశాధికారి భాస్కరయ్య, గౌరవాధ్యక్షుడు సాలోమోన్, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, డొనీహాల్ పాస్టర్ శ్యామ్‌సన్‌కుమార్, స్టాన్లీ, జాషువా రామారావు, ఊరందూరు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

- అల్లీపురంలోని అపోస్టోలిక్ క్రైస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 100 మంది దైవజనులకు దుస్తులను పంపిణీ చేశారు. బిషప్ పీటర్‌పాల్, నేతలు కలివెల ఎలీషాకుమార్, రాయపాటి హృదయ్‌కుమార్, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి జాషువా, నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ నేతలు రాఘవ మోజెస్, జోనా, అరుణ్‌భాస్కర్, కిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీటిపై అధికారులు అవగాహన కల్పించాలని మేయర్ స్రవంతి సూచించారు. నగరంలోని 13వ డివిజన్ పరిధిలో గల గ్యాస్ గోడౌన్, గౌడ హాస్టల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జునతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. అవసరమైన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌ను వదలడంతో పాటు కార్మికులు వెళ్లలేని చోట డ్రోన్ ద్వారా పిచికారీ చేయిస్తున్నామని వివరించారు. గతంలో కురిసిన వర్షానికి రోడ్డు కుంగిపోయిందని స్థానికులు తెలియజేయగా, పనులను ప్రారంభించేలా చూడాలని చెప్పారు. నేతలు శేషయ్య, శంకర్‌రెడ్డి, ఊటుకూరు చైతన్య, నీలిమ్‌కుమార్, కృష్ణ, ప్రతాప్, మనోజ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్సీ, కృష్ణచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు క్రీడా పోటీలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. తొలుత క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలను నిర్వహించారు. చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణాప్రమోద్‌రెడ్డి, విద్యాసంస్థల డీన్లు రామాంజనేయులురెడ్డి, సుధారాణి, రామ్‌గోపాల్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్ కళాశాల మైదానంలో ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవాన్ని ఉత్సాహంగా మంగళవారం నిర్వహించారు. కమిటీ కన్వీనర్, నిర్వాహకుడు బర్నబాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం, అంతర్జాతీయ సువార్తికుడు సజ్జా బర్నబాస్ వాక్యోపదేశం చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలను రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, రెవరెండ్ రాజశేఖర్‌దాసరి, ఊరందూరు సురేంద్రబాబు, ముస్లిం మైనార్టీ నేత సమీ తెలియజేశారు. అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనిల్ కుమార్ ఆన్‌లైన్లో వాక్య సందేశాన్ని అందించారు. హైదరాబాద్‌కు చెందిన జాయ్‌బెల్స్ బ్యాండ్ వారు క్రిస్మస్ గీతాలతో ఉర్రూతలూగించారు. సాల్వేషన్ ఆర్మీ ప్రిన్సిపల్ ఏసురాజ్యం, ఎలీషాకుమార్, పాస్టర్స్ అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షుడు దాసు, కేసీపీసీ అధ్యక్షుడు సతీష్, ఎస్ఈవై అధ్యక్షుడు స్వరూప్, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, ఎస్ఐబీపీఏ అధ్యక్షుడు విజయకుమార్, భరత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పదవి తెచ్చిన తంటా

- జనసేన నేతల మధ్య లుకలుకలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జనసేన పార్టీని స్థాపించిన నాటి నుంచే జిల్లాలో నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. తాజాగా జనసేన నేత నాగబాబుకు కేబినెట్‌లో సీఎం చంద్రబాబు చోటిచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ నేతల సంబరాల సమయంలో లుకలుకలు బయటపడ్డాయి. జిల్లా, నగర కార్యాలయ నేతల మధ్య పొసగక కేక్ కటింగ్ కార్యక్రమాలను వేర్వేరుగా మంగళవారం నిర్వహించారు.

➡ గోమతినగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నగరాధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబుకు సీటు లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్‌కు సీటు లేకపోయినా, అక్కడ ఉన్న నేతలు పిలిచి మరీ ఇవ్వడం విశేషం.

➡ మాగుంట లేఅవుట్లోని పార్టీ నగర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరాధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, కోవూరు ఇన్‌చార్జి చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి అలియా, నగర ప్రధాన కార్యదర్శులు మహేష్ శర్మ, అజయ్‌బాబు పాల్గొన్నారు.

రత్నం జయరామ్ కన్నుమూత



నెల్లూర(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్ (80) తుదిశ్వాసను మంగళవారం విడిచారు. కాగా ధర్మకర్త మరణించిన కారణంగా ఆలయాన్ని బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూసేసి, సాయంత్రం తెరవనున్నామని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు.

ఇక్బాల్‌బాషాకు పరామర్శ



నెల్లూరు(బారకాసు): గుండెపోటుకు గురై ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత ఇక్బాల్‌బాషాను నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. నేతలు ఆరెస్సార్, చంద్రమౌళి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సర్టిఫికెట్లు అందుకున్న వారితో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కాకుటూరు పీస్ ఆఫ్ హోప్ థియోలాజికల్ కాలేజీ ప్రొఫెసర్ పైనం ప్రసాద్ పేర్కొన్నారు. డ్రగ్ ఎడిక్షన్ నుంచి యువతను ఎలా కాపాడుకోవాలి, వ్యసనాలకు దూరంగా ఎలా ఉండాలనే అంశంపై కొండాయపాళెంలోని అబైడింగ్ హోప్ చర్చిలో అవగాహన కార్యక్రమాన్ని ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రొఫెసర్లు సుందర్‌రావు, నోవా, డాక్టర్ ఉషా, బ్రదర్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్ నుంచి పరార్

- తడలో ప్రత్యక్షం

తడ: వేదాయపాళెంలోని బాలసదన్‌లో ఉంటున్న ముగ్గురు బాలికలు తిరుపతి జిల్లా తడ రైల్వేస్టేషన్లో మంగళవారం ప్రత్యక్షమయ్యారు. స్థానికుల సమాచారం మేరకు.. సుమారు 15 నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగిన ముగ్గురు బాలికలు రాత్రి 9.30 ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడి వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు బాలికల కోసం గాలించారు. బజార్ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లేందుకు ఆటో కోసం వారు ఎదురుచూస్తుండగా గుర్తించి విచారించారు. బాలసదన్ నుంచి పారిపోయి వచ్చారని తెలుసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి బాలసదన్‌కు సమాచారమిచ్చారు. వీరిని పోలీసులు విచారించారు. బాలసదన్‌లో అందించే ఆహారం బాగాలేదని, సిబ్బంది వ్యవహరించే తీరు నచ్చక పీడీకి ఫిర్యాదు చేయాలనుకున్నామని, వద్దనుకొని పారిపోయి వచ్చామని తెలిపారు.